# వెన్నెల బయళ్ళు

ఒక పెద్ద మనిషి.

స్ఫుటమైన విగ్రహం, మెత్తని నవ్వు, తియ్యని మాట:

రామచంద్రపురంలో మా ఇంటికి వచ్చి ఎదట నిలబడి —

"మొన్న మా టీచరు సెంటర్‌క్లాసుకు పిలిస్తే రాలేదుగదూ —

అందుకే నేను స్వయంగా ఆహ్వానిద్దామని వచ్చాను. నాపేరు శ్రీహరి రావు; డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ — మామీద అంత చిన్న చూపెందుకు? పెద్ద సభల్లో ఎట్లాగూ మాట్లాడుతూ వుంటారు. కాని, మా ఎలిమెంటరీ టీచర్లకు సాహిత్యరుచి కలిగించడమే గొప్ప! వాళ్ళను ప్రభావితుల్ని చేస్తే ఒక తరం అంతా ప్రభావితం అవుతుంది. అదీ మీవంటివారు చేయదగింది. ఉపేక్షించడం తగదు. రేపు తప్పక రావాలి. వచ్చేదాకా వదలదలచుకోలేదు." అన్నారు.

ఆ అచ్చమైన కోరికను, నేస్తాన్ని కాదనలేకపోయాను.

తన రాకతో ఆ రేంజి స్కూళ్ళ ఉపాధ్యాయుల్లో ఒక నవ్య చైతన్యం ప్రవేశపెట్టారు శ్రీహరిరావుగారు.

బస్సుల్లో వినోదయాత్రలు చేయించారు. కళాక్షేత్రాలు చూపించి శిల్పంమీద రుచి కల్పించారు. మంచి పుస్తకాలు చదివించి సాహిత్యాభి మానుల్ని చేశారు.

"రేపు వైశాఖ పౌర్ణమి: పండువెన్నెల గోదావరిలో బోటుషికారు. మీరు తప్పక రావాలి."

శ్రీహరిరావుగారి పిలుపు !

రాత్రి తొమ్మిది గంటలకు కోటిపల్లి గోదావర్లో కూళ్ళ నుంచి కోరుమిల్లి వరకు రెండు నావల్లో బయలుదేరాం. సుమారు నలభై, యాభయిమంది ఉత్సాహవంతులు వచ్చారు.

ఆఫీసర్లు, తాబేదార్లు, ఇన్‌స్పెక్టర్లు, పంతుళ్ళు, అన్న భేదం లేదు. అంతా సమేకం. వెన్నెల అందం, హాయి చూరగొనడానికి ప్రతి మనిషికీ హక్కుంది.

నావల అంచున కూచున్నారు! గడలు పుచ్చుకు తోస్తున్నారు. "ఆడనే సుక్కాని, ఈడనే గడ యేసి పడవెక్కి బద్రాద్రి పోదామా" – హుషారెక్కి ఒక టీచరు సన్నగా అందుకున్నాడు. శ్రీహరిరావుగారు వాళ్ళ ఉత్సాహం చూసి కన్నతల్లి లా గోదావరి నురుగులా నవ్వుకున్నారు.

ఒక నావలో నాలుగు అరటిపళ్ళ గెలలు, పది బుట్టల పులిహోర, రెండు పెద్ద గంపల్లో మిఠాయి, మూడు కడవల పెరుగు, అరిటాకు దిళ్ళు, తమలపాకు కట్టలు, వక్కపొడి పాకెట్లు, వగైరా, వగైరా బకాసురుడి బండిలా పేర్చారు.

చుట్టూ కూర్చున్న ఒక్కొక్క వృకోదరుడు ఎప్పుడు ఒడ్డు చేరుతామా అని తహ తహ పడుతున్నాడు.

ఒకచోట పాలపొంగులా — ఒకచోట నీలాల హారంలా, గోదావరి నావలపక్క గడల చప్పులకు గలగలమంటూ ప్రవహిస్తోంది.

కోరుమిల్లికి యెదురుగా ఒక పెద్ద ఇసకతిన్నె దగ్గర నావలు ఆపి కొయ్యలకు కట్టేసి బయలుదేరాం. శుభ్రమైన ఇసకతిన్నె పట్టు తివాచీ పరిచినట్టుంది.

తెచ్చిన తుంగచాపలు పరిచారు, భోజనప్రియులు. 'పదార్థాలు భద్రం' అంటూ జాగ్రత్తగా దించారు. అరటాకులు పరిచారు. మొదటి మోాదు పులిహోర పెరుగు; రెండవ రౌండ్‌లో బంతులాడినట్టు మిఠాయి ఉండలు కానిచ్చారు తర్వాత చక్రకేళీ, అరటిపళ్ళు ఒక్కొక్కటే లాక్కుతినడం సరదా, గెలలోంచి ...

తినుబండములు, త్రాగుబండములు అయాయి. పీల్పుబండములు, నములుబండములు, పైరివేటుగా జరుగుతున్నాయి.

ఇన్‌స్పెక్టరుగారు, నేను కొంచెం కొంచెం తీసుకుని, వాళ్ళ స్వేచ్ఛకు భంగం లేకుండా దూరంగా జరిగాం.

హార్మోనియం తీశారు. గ్రామొఫోను పెట్టారు. సైగల్, పంకజ్, లతా, సుబ్బలక్ష్మి – గళులు గాల్లో తేల్తున్నాయి !

సంగీతంతో వెన్నెల బరువెక్కి ముద్దలు ముద్దలుగా రాలుతున్నట్టుంది ! వెన్నెల పాలమడుగులో ఆ ఇసకతిన్నె తెల్లగలువ పువ్వులా తేలుతోంది.

దూరంగా కూర్చుని గోదావరి కెరటాలమీదుగా కోరుమిల్లి అగ్రహారం చూస్తున్నాను. పల్లె నిద్రపోతోంది. రాజరాజు, నన్నయ్య, జ్ఞాపకం వచ్చారు. రాజరాజు ఈ అగ్రహారాన్ని చీదమార్యుడనే బ్రాహ్మడికి దానమిచ్చాడట ! నీలి ఆకాశం అంచునుంచి వెన్నెల మెట్లమీదుగా ఇద్దరూ అభిమానం తీరక ఆవలి ఒడ్డుకు దిగుతున్నారేమో అనిపించింది.

తర్వాత "మరగు నీ వెన్నెలలు.... తగని సౌఖ్యజ్వాల" అన్న మాటలు మనసులో కదలి సలపరిస్తున్నాయి. ఏదో వెర్రి ఏదో అశాంతి! పాపం – ఆ అనుభవాన్ని చెప్పడానికి మాటదొరక్క "సౌఖ్యజ్వాల" అంటాడు కృష్ణశాస్త్రి.

పురుషుడు నిష్క్రియుడు. ప్రకృతి ఆటకత్తె, ఇక్కడ ఇంతమంది పురుషులు–ప్రకృతి ఏదీ? పాపం ఆ వావలమీద వాళ్ళకీ ఏదో బెంగ గాబోలు! దొలిచే దిగులు–వాటిని కప్పుకోడానికి సంగీతాన్ని, కిల్లీలను, సిగరెట్లను ఆశ్రయిస్తున్నారు.

దయసీయులు !

ఆదిని 'ఆదాము' బెంగగా ఒకచోట పడివుంటే భగవంతుడు అతని పక్క ఎముకను లాగి 'అవ్వ'గా చేసి తోడుగా ఇచ్చాడట.

అర్ధనారీశ్వరుడన్నా అంతేగదా!

ఒక ఆదాముకు ఒక అవ్వ!

ఇప్పుడు ఎవరిస్తారు ?

నురుపులు నవ్వులుగా, అలల తళుకులు కళ్ళుగా, నల్లని నీటిజాలు దీర్ఘవేణిగా చేసి గోదావరి ఒకరమణీమణిని-ఈ వెన్నెలను కలిసి అనుభవించడానికి ప్రసాదించ కూడదూ ?

ఆలోచిస్తూ ఇసకమీద నడిచి ఎంత దూరం వెళ్ళానో ?

మెత్తగా బుజానికి ఎవరో తగిలినట్టయింది. ఏదో మృదువాసన.

"కవితాసుందరి! రమ్ము చేగలిపి ప్రక్కన్ నిల్చి నాయంసమందివతాళించు భవద్భుజమ్ము నిడి రమ్మీ కౌముదీవేళ." కవిత పెదవి కలిపింది.

వెనక్కి తిరిగి చూస్తే నవ్వుతూ రావుగారు!

తెల్లబోయాను.

"తెల్లవారుజామయింది. ఇక వెడదామా ?" అన్నారు.

నావల దగ్గర మావాళ్ళు సిద్ధంగా వున్నారు.

నావ ఎక్కాం -